## దుర్గామాత మండపాల్లో కుంకుమ పూజలు



ఓదెల : కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఓదెల, అక్టోబర్ 8: మండలంలోని దుర్గామాత మండపాల్లో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఎలిగేడు,అక్టోబర్ 8 ఎలిగేడు సాయిబాబా ఆలయంలోని దుర్గామాత మండపంలో కుంకుమపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 8: మండలంలోని పలు గ్రామాల్లో దుర్గా మాత మండపాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. 6వ రోజు అమ్మవారు మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు.

**అమ్మవారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్**

పెద్దపల్లి టౌన్, అక్టోబర్ 8: బ్రాహ్మణ సంఘం భవన్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాతను అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ దర్శించుకున్నారు. మంగళవారం అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అలంకరించారు. అదనపు కలెక్టర్, ఆర్డీవో గంగయ్యను బ్రాహ్మణ సంఘం సభ్యులు సన్మానించారు. ఇక్కడ గిరిప్రగడ కిషన్‌రావు, వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఎరబాటి రమాకాంత్, మాచిరాజు లక్ష్మణమూర్తి, పురం సురేశ్ చంద్రరావు, గూడెపు పురుషోత్తంరావు, నేదునూరి ప్రభాకర్‌రావు, కల్వకోట శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి రూరల్ : కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



పెద్దపల్లి మినీట్యాంక్ బండ్‌పై సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్

## సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి

పెద్దపల్లి, అక్టోబర్8: పెద్దపల్లి బల్దియా పరిధిలో సద్దుల బతుకమ్మ వేడుకలకు మున్సిపల్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కమిషనర్ ఆకుల వెంకటేశ్ తెలిపారు. మంగళవారం మినీ ట్యాంక్ బండ్‌పై ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏఈ సతీశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

# ధాన్యం కొనుగోళ్లకు రెడీ

- జిల్లాలో 2,06,500 ఎకరాల్లో వరి సాగు
- ఈ నెల రెండో వారం నుంచి కోతలు ప్రారంభం
- 4.85లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం
- కొనుగోళ్లపై సిబ్బందికి నేడు అవగాహన

పెద్దపల్లి, సెప్టెంబర్ 8(నమస్తే తెలంగాణ): వానకాలం ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధమవుతున్నది. జిల్లాలో ఈ సీజన్‌లో 2,06,500 ఎకరాల్లో వరి సాగు చేయగా, 4.85 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వస్తుందని వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ యంత్రాం గం అంచనా వేసింది. జిల్లా వ్యాప్తంగా 336 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కాగా, ఈ సీజన్‌లో రైతులు అత్యధికంగా సన్నాల సాగుకే ప్రాధాన్యమిచ్చారు. మంథని, ముత్తారం, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లో అత్యధికంగా 1,72,879 ఎకరాల్లో వేశారు. దొడ్డు రకాన్ని 33,621ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. 3లక్షల 57వేల మెట్రిక్ టన్నుల సన్న రకపు ధాన్యం, 91,654 మెట్రిక్ టనుల దొడ్డు వడ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ నెల రెండో వారం నుంచే కోతలు ప్రారంభంకానుండగా, వెంట వెంటనే కొనుగోళ్లు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. డిసెంబర్ చివరి వారం లేదా జనవరి మొదటి వారంలోగా కొనుగోళ్లను పూర్తి చేసేలా ప్రణాళిక చేశారు. అయితే జిల్లాలో ఈ ఏడాది అత్యధికంగా సన్నాల సాగు చేపట్టడంతో వాటి నాణ్యతను పరిశీలించేందుకు కొనుగోలు కేంద్రాల్లో డిజిటల్ డయల్ క్యాలిఫర్స్ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారులు తెలిపారు.

**కొనుగోళ్లపై నేడు అవగాహన**

కొనుగోళ్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష అధ్యక్షతన సిబ్బందికి అవగాహన కల్పించనున్నారు. సన్నాల కొనుగోళ్లతోపాటు డిజిటల్ డయల్ క్యాలిఫర్స్ వినియోగం, తదితర అంశాలపై చర్చించనున్నారు. జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాలు, డీఆర్డీవో శాఖలు సంయుక్తంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నాయి.

## ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రచారం చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీహర్ష, అధికారులు

పెద్దపల్లి, అక్టోబర్8: ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువుపై విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు జాబితా రూపకల్పన పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితా రూపొందించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ఓటరు నమోదుపై ఈనెల 16, 25న వార్తా పత్రికల్లో నోటీసు జారీ చేయాలన్నారు. అర్హులు తమ పేర్లను ఓటరు జాబితాలో నవంబర్ 6 లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 23న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ప్రచురించాలని, అభ్యంతరాలను డిసెంబర్ 25 లోగా పరిష్కరించాలన్నారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితా ప్రచురించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు బీ గంగయ్య, వీ హనుమానాయక్, తహసీల్దార్లు,అధికారులుపాల్గొన్నారు.

## హుండీ లెక్కింపు

కమాన్‌పూర్, అక్టోబర్ 8: మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామి ఆలయం హుండీలను మంగళవారం లెక్కించగా రూ. 7,29,879 ఆదాయం వచ్చినట్లు ఈవో కాంతారెడ్డి తెలిపారు. గత 3 నెలలకు సంబంధించి హుండీ కానుకలను ఉదయం లెక్కించారు. ఇక్కడ తహసీల్దార్ వాసంతి, ఆలయ ప్రధాన చార్యులు వరప్రసాద్, పరిశీలకులు శ్రీనివాస్, సిబ్బంది కల్వల సంత, మల్లేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గర్రెపల్లిలో చోరీకి యత్నం

సుల్తానాబాద్‌రూరల్, అక్టోబర్ 8 : గర్రెపల్లిలో ఎవరూ లేని ఇండ్లను గుర్తించి చోరీకి యత్నించి స్థానికులకు చిక్కారు. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి. గర్రెపల్లిలో ఆది రంగారావు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. మంగళవారం దాదాపు మూడు నుంచి నాలుగు గంటల మధ్య సమయంలో వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురు మహిళలు రెక్కీ నిర్వహించారు. రంగారావు ఇంట్లో చోరీకి యత్నించగా స్థానికులు గమనించి పట్టుకున్నారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూసేసరికి వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. స్థానికులు వారిని పోలీసులకు అప్పగించారు. వారు వచ్చిన ఆటో , రూ.20 వేయి ప్రాపర్టీని రికవరీ చేసినట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు.

## పీఆర్టీయూ రాష్ట్ర కమిటీలో జిల్లావాసులు

కమాన్‌పూర్, అక్టోబర్ 8: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నాంపల్లి రాజ్‌కుమార్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. రాజ్‌కుమార్ నియామకంపై జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్, ప్రధాన కార్యదర్శి గుండు కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు గసిగంటి రమేశ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

జూలపల్లి, అక్టోబర్ 8 : పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ ఎన్నికల్లో మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి పదవులు దక్కాయి. స్టేట్ అసోసియేట్ అధ్యక్షుడిగా కుమ్మరికుంట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గడ్డం అనంతరెడ్డి, పెద్దాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆకుల రాజన్నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్, ప్రధాన కార్యదర్శి గండు కృష్ణమూర్తి, మండలాధ్యక్షుడు ముత్యంరావు, ప్రధాన కార్యదర్శి బొల్లం ప్రవీణ్, జిల్లా కార్యదర్శి కొత్త శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మంథని రూరల్/జ్యోతినగర్, అక్టోబర్ 8: పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా విలోచవరం స్కూల్ అసిస్టెంట్ బొంతల సతీశ్ బాబు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర కౌన్సిల్‌లో సతీశ్ బాబును మరోసారి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కర్రు సురేశ్, కార్యదర్శి కృష్ణమూర్తికి సతీశ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 8: హైదరాబాద్‌లో రెండురోజులుగా జరుగుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రామగుండం మండలంలోని ఎన్టీపీసీ జడ్పీహెచ్‌ఎస్, పాములపేట, బీ థర్మల్ ఎంపీపీఎస్ స్కూల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న గుళ్ల అంజన్‌కుమార్, పెరటి రవీందర్, కుంట రామన్న పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ ఎన్నికపై వారు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి, కార్యదర్శి దామోదర్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పూడికతీత పనులు ప్రారంభం

ఓదెల, అక్టోబర్ 8: కొలనూర్‌లోని రెండో వార్డులో ఎస్సారెస్పీ కాల్వలో పూడికతీత పనులు చేపట్టారు. ఇండ్ల మధ్యన గల ఎస్సారెస్పీ కాల్వలో పూర్తిగా మట్టి, పిచ్చిమొక్కలతో నిండి దుర్వాసన వస్తున్నది. గమనించిన కార్యదర్శి శ్రీనివాస్ కాల్వను శుభ్రం చేయించారు.

## క్రీడా పోటీలు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబర్ 8 : ఆర్జీ-2 ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి లెవల్ టేబుల్ టెన్నిస్, షటిల్ క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11డివిజన్‌ల నుంచి క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి కోల్ ఇండియా పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి జీ. రవీందర్, ఎస్ఓటుజీఎం సంతోష్ కుమార్, అధికారులు ధనుంజయ్, మురళీకృష్ణ, షరీఫ్ మహమ్మద్, క్రీడల కోర్డినేటర్ నరేందర్ రెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

## వృద్ధురాలిపై దాడి...అభరణాలు అపహరణ

జ్యోతినగర్, అక్టోబర్ 8: ఎన్టీపీసీ పట్టణ పరిధి రెండోడివిజన్ పీకే రామయ్యకాలనీకి చెందిన నిర్మల మండల్ అనే వృద్ధురాలిని నమ్మించి దాడిచేసి ఒంటిపై ఉన్న బంగారు చెవికమ్మలు, వెండికడాలను ఆశ్విని అనే మహిళ అపహరించిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. ఎన్టీపీసీ ఎస్ఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం పీకే రామయ్యకాలనీకి చెందిన నిర్మల్‌మండల్ వృద్ధురాలికి అదేకాలనీకి చెందిన ఆశ్విని పని కల్పిస్తానని నమ్మించింది. పొద్దంతా గోదావరిఖని పరిసర ప్రాంతాల్లో తిప్పి రాత్రి ఇంటి ప్రయణంలో పీకే రామయ్యకాలనీ వెళ్లే దారిలో ఉన్న చెట్లపొదల్లోకి తీసుకువెళ్లి నోట్లో గుడ్డలు కుక్కి వృద్ధురాలిపై దాడిచేసి రెండు తులాల బంగారు చెవికమ్మలు, వెండి కాళ్ల కడాలను అపహరించింది. దాడితో అక్కడే వృద్ధురాలు స్పృహ కోల్పోయింది. మంగళవారం ఉదయం లేచి ఇంటికి వెళ్లి జరిగిన ఘటనను కాలనీవాసులకు తెలిపింది. వృద్ధురాలి మెడ, చెవులు, చేతులకు తీవ్రగాయాలు కాగా కాలనీవాసులు గోదావరిఖని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధితురాలి తరపున కాలనీ వాసి పసుల ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆశ్వినిపై కేసునమోదు చేసి విచారణ చేపట్టారు.

## మాజీ ఎమ్మెల్యే ఇంట్లో చోరీ

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 8: పట్టణంలోని మార్కండయకాలనీలోని మాజీ ఎమ్మెల్యే మాలం మల్లేశం ఇంట్లో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. 12తులాల బంగారు, 15తులాల వెండి అభరణాలు, రూ.50వేలు అపహరించారు. గోదావరిఖని వన్‌టౌన్ రెండో సీఐ రవీందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటి కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లగా గుర్తుతెలియని దొంగలు ఇంటి వెనుకాల నుంచి చొరబడ్డారు. ఇంట్లో దాచుకున్న నగదు, బంగారు, వెండి అభరణాలను ఎత్తుకెళ్లారు. అపహరణకు గురైన ఆభరణాల ఖరీదు దాదాపు రూ.2.98లక్షలు, బాధితుడు మాలం కిరణ్ ఫిర్యాదు మేరకు సీఐ కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## మంథని ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం

మంథని, అక్టోబర్ 8: మంథని ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. 11 మంది ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు అందజేసినట్లు డీఎం వెల్లడించారు. ప్రయాణికులు సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు.

## సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు చేయాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 8 : సద్దుల బతుకమ్మ పండుగకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో శ్రీధర్ సూచించారు. పలు గ్రామాల్లో మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి ఎండీ అఫ్జల్ పాషా, ఈజీఎస్ ఎఫ్ఏ ఇండ్ల రమేశ్ ఉన్నారు. దేవుని పల్లి, నిట్టూరు గ్రామాల్లో మంగళవారం సద్దులబతకమ్మ ఏర్పాట్లును ఎంపీడీవో శ్రీధర్, ఏవో కాంతాల అలివేణి పరిశీలిం చారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు ఆవుల అఖిల, శరత్‌బాబు ఉన్నారు.

---

**వాణిజ్య**

### సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశా రు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

### టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్‌వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

### ఎఫ్ఎంసీజీపై పామాయిల్ పిడుగు


న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

# హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

**19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం**

**జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి**

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.



**బయ్యర్లలో తగ్గిన ఆసక్తి**

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**హైడ్రా ఎఫెక్ట్**

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధానిలోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచననే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనేవారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.


**దేశవ్యాప్తంగా..**

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

# బీవైడీ సరికొత్త ఈవీ

*సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..*

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి.




ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

## ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వ్‌బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షల్లో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.




## హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండుమల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

# హమ్మయ్య..కోలుకున్నాయి

**సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం • 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద**




ముంబై, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేకపడింది. వరుసగా ఆరు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపుకు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 585 పాయింట్లు అందుకొని 81,635 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 217.40 పాయింట్లు ఎగబాకి తిరిగి 25 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు 25,013.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మదుపరుల సంపద భారీ స్థాయిలో పెరిగింది. గత ఆరు సెషన్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు ఒక మంగళవారం నాడే రూ.7 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.7,51,481.51 కోట్లు పెరిగి రూ.4,59,50,926.21 కోట్లు(5.47 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు ఆర్బీఐ తన పరపతి సమీక్షలో తీసుకునే నిర్ణయం కోసం మదుపరులు వేచి చూస్తుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను తరలించుకుపోయినప్పటికీ సూచీలు లాభాల్లో ముగిశాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- అదానీపోర్ట్స్ 4.76 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఎస్బీఐ, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, కొటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.
- టాటా స్టీల్, టైటాన్, టాటా మోటర్స్, హెచ్‌యూఎల్, ఐటీసీ, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి నష్టపోయాయి.
- బ్యాంకింగ్, టెలికం, వాహన, రియల్టీ రంగ షేర్లు కదంతొక్కాయి.
- రంగాలవారీగా సేవలు 3.25 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.82 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.81 శాతం, పవర్ 2.44 శాతం, టెలికం 2.35 శాతం చొప్పున బలపడ్డాయి.
- ప్రారంభంలో భారీగా నష్టపోయిన ఓలా షేరు చివర్లో కోలుకున్నది. కొనుగోలుదారులను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు, వాణిజ్య ఉల్లంఘనలు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో గత మూడు రోజులు పతనమైన షేరు 5 శాతం లాభపడి రూ.95.46 వద్ద ముగిసింది.

### స్టాండర్డ్ గ్లాస్ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, అక్టోబర్ 8: రాష్ట్రానికి చెందిన ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగ పరికరాల తయారీ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి లైన్ క్లియర్ అయింది. ఇందుకు సంబంధించి సంస్థ దాఖలు చేసుకున్న ఐపీవో ప్రతిపాదనకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జూలై 24, 2024 నాడు సంస్థ ఐపీవోకి దరఖాస్తు చేసుకున్నది. వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.600 కోట్ల వరకు నిధులు సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో భాగంగా తాజా షేర్లను జారీ చేయడంతో రూ.250 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో మరో 1.84 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించడం ద్వారా మరో రూ.350 కోట్లు సేకరించాలనుకుంటున్నది. ఇలా సేకరించిన నిధులను భవిష్యత్తు వ్యాపార విస్తరణకోసం, రుణాల చెల్లింపుల కోసం వినియోగించనున్నది. దీంతోపాటు మరో ఐదు కంపెనీల ఐపీవోల ప్రతిపాదనకు సెబీ అనుమతినిచ్చింది. వీటిలో ఎన్ఎస్‌డీఎల్, జింకా లాజిస్టిక్స్ సొల్యూషన్స్, ఎన్ఎస్ఈ, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు కూడా ఉన్నాయి.